VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 251

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 19 ఫిబ్రవరి 2026



## నేడే నూతన భవన ప్రారంభోత్సవం



# శ్రీ వాసవీ శివగంగా నిత్యాన్న ట్రస్ట్

SVSGN TRUST

Regd. No. 135/2021



ది. 20-02-2026
శుక్రవారం
ఉదయం గం॥ 10-25 ని॥లకు

## నూతన వసతి భవన ప్రారంభోత్సవం

## తిరువణ్ణామలై (అరుణాచలం)

అగ్నితీర్థం ప్రక్కన నెం.3, ఓవస్ నగర్, బ్లాక్-1, 1వ లైను, షణ్ముఖి స్కూల్ ఎదురు



| ఆధ్యక్షులు : | గౌరవ ఆధ్యక్షులు : | ప్రధాన కార్యదర్శి : | కోశాధికారి : |
|---|---|---|---|
| కోట్ల సోమేశ్వరరావు | కొత్తమాసు రత్నాకరరావు | కనమర్లపూడి హరిప్రసాదరావు | చింతా శ్రీనివాసరావు |
| తణుకు, సెల్ : 9347055575 | అప్పాపురం, సెల్ : 9491673342 | ఒంగోలు, సెల్ : 9949912120 | పిడుగురాళ్ళ సెల్ : 9885202524 |

### ఉపాధ్యక్షులు



| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| పెనుగొండ వెంకట నరసింహారావు | శిద్దా వెంకట సురేష్ కుమార్ | కొత్తమాసు బాల సుబ్రహ్మణ్యం | మామిడిపాక హరిప్రసాదరావు | కనికిచర్ల వెంకటేశ్వర్లు | అత్యం సూర్యనారాయణమూర్తి | కొప్పర్తి వెంకట నారాయణమూర్తి |
| మార్కాపురం | ఒంగోలు | విజయవాడ | పర్చూరు | పొన్నూరు | కాకినాడ | ఆకివీడు |



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| మట్టుపల్లి రవికుమార్ | బైసాని వెంకట శేషఫణి | కొంకిమళ్ళ శ్రీనివాసరావు | తాతా కుమారస్వామి | పాదర్తి వెంకట కోటేశ్వరరావు | గుడివాడ అప్పలరాజు | వెలుగూరి రవికుమార్ | వేముల లక్ష్మణరావు |
| గుంటూరు | తాడిపత్రి | ఒంగోలు | చీరాల | చీరాల | పెరవలి | రావులపాలెం | సుజాత నగర్, ఖమ్మం జిల్లా. |



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఆర్గనైజింగ్ సెక్రటరీ : | సహాయ కార్యదర్శి : | సహాయ కార్యదర్శి : | సహాయ కార్యదర్శి : | సహాయ కార్యదర్శి : | సహాయ కార్యదర్శి : | సహాయ కార్యదర్శి : | సహాయ కార్యదర్శి : |
| చినిగేపల్లి సురేష్ బాబు | శింగంశెట్టి శ్రీకృష్ణ | గురం సింగయ్య | గ్రంది లక్ష్మి | సన్నిధి రామ వెంకటేశ్వరరావు | దూది ప్రభాకర్ | కనమర్లపూడి సాంబశివరావు | పులవర్తి రవిబాబు |
| ఒంగోలు | విజయవాడ | కందుకూరు | విశాఖపట్నం | ఆకివీడు | కొత్తపల్లి | ఒంగోలు | న్యూఢిల్లీ |

### కార్యవర్గ సభ్యులు



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| N.V.K.Ch.N. సురేష్ | పులవర్తి లక్ష్మణ్ | కారుమూరి అప్పలరాజు | పెంటేల వెంకట జనార్దన్ కుమార్ | నేరెళ్ళ రఘునందన్ | పరింకాయల రంగనాయకులు | చేబ్రోలు తనోజ్ శ్రీనివాస్ కుమార్ | బచ్చు లక్ష్మీప్రసాదు |
| తణుకు | ఆకివీడు | ఆకివీడు | ఒంగోలు | ఒంగోలు | తిరుపతి | ఒంగోలు | చెన్నై |

# చట్టసభల పనితీరును పరిశీలించిన విద్యార్థులు

● త్వరలో పోలవరం సందర్శనకు అవకాశం.. ● విద్యార్థులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలి : స్పీకర్ అయ్యన్నపాత్రుడు







**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికగా బుధవారం విద్యార్థుల కోలాహలం నెలకొంది. భావి భారత పౌరులైన విద్యార్థులకు చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య విలువలు, చట్టాల రూపకల్పన ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ పర్యటనలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గత ఆరు రోజులుగా కొనసాగుతున్న ఈ విజ్ఞాన యాత్రలో భాగంగా ఇప్పటివరకు దాదాపు 1400 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించడం విశేషం. సభలో ప్రజా సమస్యలపై జరిగే చర్చలను, సభా వ్యవహారాలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. సభా విరామ సమయంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఆయన ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీని వీక్షించిన విద్యార్థులకు త్వరలోనే పోలవరం ప్రాజెక్టును కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఉద్యోగం చేస్తే కుటుంబానికే పరిమితం అవుతారని, రాజకీయాలలోకి వస్తే ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందని వారికి ఉద్బోధించారు. నియోజకవర్గాల వారీగా వచ్చిన విద్యార్థులతో ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు ప్రత్యేకంగా కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, శాసనసభ్యులు బోడె ప్రసాద్, అమ్మిశెట్టి సురేంద్రబాబు, వెనిగండ్ల రాము, సుందరపు విజయ్ కుమార్, బొమ్మిడి నాయకర్, బండారు శ్రావణి, యార్లగడ్డ వెంకట రావు తదితరులు పాల్గొని విద్యార్థులను ఆత్మీయంగా పలకరించారు. చట్టసభల వాతావరణాన్ని నేరుగా చూడటం తమకు ఎంతో జ్ఞానాన్ని, కొత్త స్ఫూర్తిని ఇచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# 22ఎ జాబితా నుండి భూముల తొలగింపు మరింత సరళతరం

● ఇంఛార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్ ● పేదలకు లబ్ది చేకూరేలా నిషేధిత జాబితా భూములపై నిర్ణయం

● అసెంబ్లీ సమావేశాల్లో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి,కలంకౌంటర్ :** 22ఎ నిషేధిత జాబితా నుండి భూములను తొలగించే ప్రక్రియను మరింత సరళతరం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం శాసనసభలో టిడిపి ఎమ్మెల్యే కొలికలపూడి శ్రీనివాసరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భూ ఆక్రమణ, 22ఎ జాబితా నుండి తొలగింపు అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సమాధానమిస్తూ 22ఎ నిషేధిత జాబితా నుండి ప్రయివేట్ భూములను తొలగించేందుకు ఇప్పటికే మెమోను జారీ చేశామని, ఇందులో ఐదు రకాల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. ఈ సందర్భంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు కలుగజేసుకొని 22ఎ నిషేధిత భూముల సమస్య రాష్ట్ర మంతా ఉందని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం కూడా మంచి మార్గదర్శకాలు కూడా ఇచ్చిందని, ఇవి అమలయ్యేలా చూడాలని మంత్రి అనగానిని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందిస్తూ 22ఎ నిషేధిత జాబితా నుండి ప్రయివేట్ భూముల తొలగింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తామన్నారు. తమ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తాను, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ ఒక టీమ్ గా ఏర్పడి 22ఎ భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తున్నామని చెప్పారు. పేదలకు లబ్ది జరిగేలా, సామాన్యులు నష్టపోకుండా ఉండేలా 22ఎ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించమని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మార్గనిర్దేశం చేశారని, తాము ఆ దిశగా పని చేస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో 22ఎ భూముల తొలగింపునకు ఇచ్చిన ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఇంఛార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక డ్రైవ్ చేపడతారని చెప్పారు. తిరువూరు మండలంలోని రామన్న పాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 22 లో ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రశ్న అడగగా ఆ భూములకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయని, కోర్టు తీర్పు వచ్చేంతవరకు ఎదురు చూడాల్సి ఉందన్నారు. అలాగే విశాఖలో మాజీ సైనికోద్యోగులకు అసైన్డ్ చేసిన భూముల అమ్మకాలకు సంబంధించి బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూములను పదేళ్ల తర్వాత వారు గానీ, వారి వారసులు గానీ అమ్ముకోవచ్చని, అయితే అలా కేటాయించిన భూముల్లో నీటి వనరులు ఉంటే కొన్ని సుప్రీంకోర్ట్, హైకోర్టు తీర్పుల రీత్యా, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని, అందుకే వాటిని నిషేధిత జాబితాలో పెట్టినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి చంద్రశేఖర్‌రావు భౌతిక కాయానికి వైయస్ జగన్ నివాళి





**విజయవాడ,కలంకౌంటర్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి తలశిల చంద్రశేఖర్ రావు (88) మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ గొల్లపూడిలోని తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి చంద్రశేఖర్ రావు భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. చంద్రశేఖర్ రావు మరణం తలశిల రఘురామ్ కి, కుటుంబ సభ్యులకు తీరని లోటని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో తలశిల రఘురామ్ కి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, చంద్రశేఖర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానని వైయస్ జగన్ తెలిపారు.

# ఆ ఒక్కటి తప్పు... జైలు జీవితం బాగా ఎంజాయ్ చేశాను: అంబటి రాంబాబు

● బెయిల్ పై జైలు నుంచి విడుదలైన అంబటి రాంబాబు ●జైలులో బాత్రూంలో జారిపడటం మినహా తనకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని వ్యాఖ్య ● తనను చంద్రబాబు, లోకేశ్ టార్గెట్ చేశారని తీవ్ర ఆరోపణలు ●కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టీకరణ



**రాజమండ్రి,కలంకౌంటర్ :** రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని తాను శిక్షగా కాకుండా ఒక శిక్షణగా భావించానని అన్నారు. అయితే, ఈ సమయంలో తాను ఎదుర్కొన్న ఏకైక ఇబ్బంది బాత్రూంలో జారిపడటమేనని, అది మినహా జైలు జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేశానని వ్యాఖ్యానించారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు. "నన్ను 18 రోజులు జైల్లో పెడితే భయపడతానని చంద్రబాబు, లోకేశ్ అనుకున్నారేమో. కానీ, ఈ అంబటి రాంబాబు ఎవరికీ భయపడే ప్రశ్నే ఉద్భవించదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పుడే జైల్లో ఉండటానికి సిద్ధపడ్డాను. నన్ను జైల్లో పెట్టాలని వారు ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు, ఇప్పుడు అవకాశం దొరికింది, లోపల పెట్టారు. కానీ కాలం మళ్లీ తిరిగొస్తుంది. వారు చేసిన పాపానికి మూల్యం చెల్లించక తప్పదు" అని అంబటి హెచ్చరించారు. జైలు తనలో మరింత కసిని, పట్టుదలను పెంచిందని, ఒక్క అడుగు కూడా వెనక్కి వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

**దాడి వెనుక చంద్రబాబు, లోకేశ్..** తన ఇంటిపై జరిగిన దాడి ఘటనను పూర్తిగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. "సుమారు ఏడు గంటల పాటు నా ఇంటిపై దుండగులు దాడి చేస్తుంటే పోలీసులు అక్కడే ఉన్నారు. వారి సమక్షంలో, వారి రక్షణలోనే ఈ దాడి జరిగింది. నన్ను రక్షించాల్సిన పోలీసులే 'సార్, మీరు గోడ దూకి పారిపోండి' అని చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇది ఆటవిక రాజ్యం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారికి వెంటనే బెయిల్ వచ్చిందని, బాధితుడినైన తనకు మాత్రం 18 రోజుల తర్వాత బెయిల్ లభించిందని అన్నారు. తన భార్యాబిడ్డలను, మనవళ్లను భయభ్రాంతులకు గురిచేశారని, తనను చంపడానికి కూడా ప్రయత్నించారని ఆరోపించారు.

**జైల్లో సాధారణ ఖైదీగానే..** జైల్లో అధికారులు నిబంధనల ప్రకారమే వ్యవహరించారని, తాను ప్రత్యేక సౌకర్యాలు ఏవీ కోరలేదని అంబటి తెలిపారు. "జైల్లో పెట్టే ఆహారమే తిన్నాను. అది నాకు నచ్చలేదు. కానీ కలకాలం తినను కదా? బయటి భోజనం కోసం కోర్టు అనుమతి ఇవ్వలేదు. అందుకే లోపలి భోజనమే చేశాను. అందుకే కొంచెం చిక్కినట్టు ఉన్నా, ఆరోగ్యంగానే ఉన్నాను. ఎలాంటి ఇబ్బంది లేదు" అని వివరించారు. జగన్ నాయకత్వంలోనే తన రాజకీయ ప్రస్థానం కొనసాగుతుందని, ప్రాణం ఉన్నంతవరకు ఆయన వెంటే నడుస్తానని అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా, ఎన్నిసార్లు జైల్లో పెట్టినా తాను వెనకడుగు వేయనని, ప్రజాస్వామ్యబద్ధంగా ఈ కూటమి ప్రభుత్వాన్ని కూల్చేంతవరకు తన పోరాటం ఆగదని ప్రకటించారు. రాష్ట్రంలో జరిగిన పరిణామాలపై తనకు పూర్తి సమాచారం లేదని, అన్ని విషయాలు తెలుసుకుని గుంటూరులో రేపు విలేకరుల సమావేశంలో సమగ్రంగా మాట్లాడతానని ఆయన వెల్లడించారు.

# క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ క్రైస్తవ సోదర సోదరీమణులకు లెంట్ సీజన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే 40 రోజుల ఉపవాస దీక్షల ప్రారంభం సందర్భంగా ఆయన తన సందేశాన్ని విడుదల చేశారు. ఈ మేరకు లోకేశ్ స్పందిస్తూ.. "లెంట్ పవిత్ర కాలాన్ని పాటిస్తున్న క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. యేసు క్రీస్తు జీవితం, త్యాగాలను స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాసం, ప్రార్థన, ధ్యానంతో గడిపే ఈ పవిత్రమైన సమయం ప్రతి ఒక్కరిలో విశ్వాసాన్ని, కరుణను, ఆశను పునరుద్ధరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ తన సందేశాన్ని ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. ఆయన పోస్ట్‌పై క్రైస్తవ సంఘాల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. పలువురు నెటిజన్లు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

# తిరుమల లడ్డూపై శాసనమండలిలో చర్చించాలన్న బొత్స సత్యనారాయణ



**అమరావతి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు గుప్పించారు. మండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేస్తున్నారని, సీబీఐ దర్యాప్తులో ఎలాంటి కొవ్వు లేదని తేలిందని ఆయన అన్నారు. "ఇందాపూర్ ద్వారా దోచుకోవాలనేది చంద్రబాబు దుర్బుద్ధి. హోంమంత్రి వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారు. మేం కూడా వాస్తవాలు తేల్చాలనే తిరుమల లడ్డూపై మండలిలో చర్చిద్దామని కోరుతున్నాం. ఇందాపూర్‌తో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం చేసుకుంది. సభలో బడ్జెట్‌తో పాటు ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే" అని బొత్స అన్నారు. తాము చెబుతున్న దాంట్లో అవాస్తవాలు ఉంటే వాస్తవాలను తేల్చడానికి చర్చకు రావాలని బొత్స సవాల్ విసిరారు. ఆధారాలతో సహా తాము నిరూపిస్తామని చెప్పారు. రూ.320కి కొనుగోలు చేసే నెయ్యిని రూ.700కి పెంచడం వెనుక ఉన్న కారణం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని అన్నారు. వీళ్లు చేస్తున్న దోపిడీని బీజేపీ నేతలు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి అధికారంలో ఉండే నైతికత లేదని అన్నారు. గతంలో తిరుమల లడ్డూ ఇస్తే భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారని, ఇప్పుడు లడ్డూ ఇస్తే పరిశీలించి చూసి తింటున్నారని బొత్స చెప్పారు. మంత్రి నారా లోకేశ్ తెలిసీ తెలియక మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము పట్టుకోల్పోయామనే భావనలో ఆయన ఉంటే ఉండనివ్వాలని... తమకు ఎలాంటి నష్టం లేదని అన్నారు.

## టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చకు సిద్ధం : హోంమంత్రి అనిత



**అమరావతి,కలంకౌంటర్ :** టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై తాము చర్చకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని, ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు సవాల్ విసిరారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని,రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ 34 సంవత్సరాలుగా ఉన్న సంస్థ అని,హెరిటేజ్ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధన పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు.

**సభలో రాద్ధాంతం చేస్తే కుదరదు..** వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని, ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. ఒక పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పౌష్టికాహారం పంపిణీ చేసిన కర్లపాటి ట్రస్ట్



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి ఫోర్ లో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, నిరు పేద వయోవృద్ధులకు పదివేల రూపాయల విలువైన పౌష్టికాహారాన్ని శ్రీ స్వామి రామానంద సరస్వతి వారి ఆశీస్సులతో బుధవారం అందజేయడం జరిగిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ నిర్వహణ కమిటీ సభ్యులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేసు రామచంద్ర సహకరించగా, శ్రేయస్సు సిబ్బంది లక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధులు రాయపూడి వెంకటేశ్వరావు, రామకృష్ణ, రుక్మిణి,ట్రస్ట్ సిబ్బంది పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వైభవంగా శివ పార్వతుల కళ్యాణం



**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,కలంకౌంటర్ :** నాయుడుపేట లో శివాలయం నందు శివరాత్రి ఉత్సవాల కార్యక్రమాలలో భాగంగా శివపార్వతుల కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కనమర్లపూడి సురేష్,ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆలయానికి వాటర్ కూలర్స్ బహుకరణ



**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** చందోలు గ్రామంలో గల శ్రీ భగలాముఖి అమ్మవారి ఆలయానికి అమెరికాకి చెందిన శ్రీ పాలడుగు రాజగోపాల్ శ్రీ లక్ష్మి లక్ష పదివేల విలువైన రెండు వాటర్ కూలర్ను భక్తుల సౌకర్యార్థం ఆలయానికి అందజేశారు.

## వార్షిక క్రీడలు



**తిరుమల,కలంకౌంటర్ :** టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలలో భాగంగా క్యారమ్స్ డబల్స్ విన్నర్స్ గా శంకర్ , భాస్కర్ జట్టు, రన్నర్స్ గా చీర్ల కిరణ్, రమేష్ జట్టు.

# పశుపోషకులకు తక్కువ ధరల్లో జనరిక్ పశు ఔషధాలు

## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని పశు పోషకులకు నాణ్యమైన జనరిక్ పశు ఔషధాలను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచి పశు సంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ,పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్టో లో చెప్పిన విధంగా పశుపోషకులకు సబ్సిడీపై మందుల పంపిణీ అందించేలా చేసిన హామీని నేడు నెరవేర్చనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 150 పశు ఔషధ విక్రయ కేంద్రాలను మొదటి దశలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పశుపోషకులకు తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలు అందించడంతో పాటు జంతువుల చికిత్స ఖర్చులను గణనీయంగా తగ్గించగలమన్నారు. గ్రామ స్థాయి గొర్రెల పెంపక సహకార సంఘాల ద్వారా మాత్రమే ఈ కేంద్రాలు నిర్వహించబడతాయని, మహిళా సభ్యులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఆశావహ జిల్లాల్లో ఒక్కో కేంద్రానికి రూ. 1.5 లక్షల ప్రత్యేక సహాయం అందిస్తామని వెల్లడించారు. యూనిట్‌కు రూ.3.61 లక్షల వ్యయంతో మొత్తం రూ.5.41 కోట్ల ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, కొనుగోలు మరియు నిల్వలపై 20 శాతం ప్రోత్సాహకం, విక్రయాలపై 20 శాతం మార్జిన్ లభిస్తుందని తెలిపారు. సమన్వయంతో నాణ్యత నియంత్రణ, సరఫరా నిర్వహణ జరుగుతుందని, ఈ కేంద్రాలు పశు వైద్యశాల ఆవరణలో నిర్వహించబడతాయని, అన్ని లావాదేవీలు పాయింట్ ఆఫ్ సేల్ ద్వారా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, పశుసంవర్ధక రంగం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు

- నేటి నుంచి ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లు ప్రారంభం
- స్టాళ్ల ద్వారా ప్రఖ్యాత గాంచిన చేనేత వస్త్రాల విక్రయం - మంత్రి సవిత





**అమరావతి,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, బజార్లు, వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. పండగ సమయాల్లో భారీ డిస్కౌంట్లు అందజేస్తూ చేనేత వస్త్రాల వినియోగం పెంచడంతో పాటు నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే కాకుండా ఆదాయం ఆర్జించేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, శాసనమండలికి వస్తున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచే లక్ష్యంతో గురువారం నుంచి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను చేనేత, జౌళి శాఖాధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తయారవుతున్న ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఈ స్టాళ్లలో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు ఇంటిల్లిపాది వినియోగించుకునే రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నారు. లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం అమ్మకానికి పెట్టనున్నారు. గురువారం ఈ స్టాళ్లను ప్రారంభించి, అమ్మకాలు ప్రారంభించనున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీరలను అమ్మకానికి పెట్టాలని చేనేత, జౌళి శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. చేనేత స్టాళ్లతో పాటు ఫొటో స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రి నారా లోకేశ్ దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహా పలువురు ప్రముఖులు చేనేత ఎగ్జిబిషన్లు సందర్శన, వారు చేనేత వస్త్రాల కొనుగోలు చేసిన, ధరించిన దృశ్యాలను ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. నేతన్నలతో సీఎం చంద్రబాబు నాయుడు సంభాషిస్తున్న దృశ్యాలు కూడా ఎగ్జిబిషన్లో ప్రదర్శనకు పెట్టారు.


# జాతీయస్థాయిలో కలాం సైన్స్ ఒలింపియాడ్ సత్తాచాటిన కొమ్మారెడ్డి విద్యార్థులు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** నవంబరు 2025 లో ఎడ్యుహంట్ నీట్–ఐఐటి అకాడమీ, విశాఖపట్నం వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన కలాం సైన్స్ ఒలింపియాడ్ మరియు శ్రీనివాస రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ లలో బంటుమిల్లి కొమ్మారెడ్డి హై స్కూల్ విద్యార్థులు లెవెల్ -- 1 లో తరగతుల వారీగా వివిధ జాతీయ స్థాయి ర్యాంకులు సాధించి లెవెల్ -- 2 కు ఎంపికయ్యారు. వీరికి గోల్డ్ మరియు సిల్వర్ మెడల్స్ ను ప్రధానం చేయడం జరిగిందని కొమ్మారెడ్డి హై స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కలాం సైన్స్ ఒలింపియాడ్ లో తరగతుల వారీగా జాతీయ స్థాయి లో ప్రతిభ చూపిన విద్యార్థులు :- ఇ. దివిజ (10 వ తరగతి) – జాతీయ స్థాయి 54 ర్యాంక్ -- గోల్డ్ మెడల్,కె. వెంకట పావని (10 వ తరగతి) – జాతీయ స్థాయి 101 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ ,యన్. గీతిక ప్రియ (9 వ తరగతి ) -- జాతీయ స్థాయి 2,101 ర్యాంక్ -- గోల్డ్ మెడల్ యం. పృథ్వి తేజ (9 వ తరగతి ) -- జాతీయ స్థాయి 2,285 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ హెచ్.ఎ. ఫాతిమా (9 వ తరగతి ) -- జాతీయ స్థాయి 2,285 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ యస్. జాహ్నవి ( 8 వ తరగతి) -- జాతీయ స్థాయి 6,750 ర్యాంక్ -- గోల్డ్ మెడల్ సి. హెచ్. అక్షయ నాగ సింధు ( 8 వ తరగతి) -- జాతీయ స్థాయి 7,525 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ వి. మోజెస్ ఫిన్ని ( 8 వ తరగతి) -- జాతీయ స్థాయి 7,525 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ సాధించారు అలాగే శ్రీనివాస రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ లో తరగతుల వారీగా జాతీయ స్థాయి లో ప్రతిభ చూపిన విద్యార్థులు వివరాలు ఇలా ఉన్నాయి :-జె.జి. రత్నాకర్ (10 వ తరగతి)– జాతీయ స్థాయి 45 ర్యాంక్ -- గోల్డ్ మెడల్ ,పి. రవళి (10 వ తరగతి)– జాతీయ స్థాయి 83 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ కె. గీతిక (9 వ తరగతి ) -- జాతీయ స్థాయి 984 ర్యాంక్ -- గోల్డ్ మెడల్ కె. నందిని (9 వ తరగతి ) -- జాతీయ స్థాయి 2323 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ పి. మహీధర్ (8 వ తరగతి) – జాతీయ స్థాయి 638 ర్యాంక్ -- గోల్డ్ మెడల్ పి. కావ్య శ్రీ (8 వ తరగతి) – జాతీయ స్థాయి 684 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ జి. కార్తికేయ (8 వ తరగతి) – జాతీయ స్థాయి 684 ర్యాంక్ -- సిల్వర్ మెడల్ సాధించారని కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు . విజేతలైన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ , స్కూల్ సెక్రెటరీ మరియు కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ , కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య , డైరెక్టర్ & వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి , స్కూల్ ప్రధానోపాధ్యాయులు. ఎన్.శ్రీనివాసరావు , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

# నియోజకవర్గ ప్రగతి పై మంత్రి పార్ధసారధి వరుస సమీక్షలు..

- బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల పరిస్థితులపై మంత్రి ప్రత్యేక ఆరా.
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై మంత్రి సారథి సీరియస్





**నూజివీడు,కలంకౌంటర్ :** రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్ధసారథి నూజివీడు నియోజకవర్గ ప్రగతిపై ఫోకస్ పెంచారు. అన్ని శాఖలపై మంత్రి వంపస సమీక్షలతో బిజీబిజీగా గడుపుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు మంత్రి సారథి సీరియస్ వార్నింగులే ఇస్తున్నారు. తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని నిర్మొహమాటంగా ముఖం మీదే చెప్పేస్తున్నారు. తాజాగా ఈరోజు మంత్రిగారి క్యాంపు కార్యాలయంలో ఎస్టీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ మరియు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి, నియోజకవర్గంలోని పీహెచ్‌సీలపై మంత్రి ఆకస్మిక రివ్యూ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ప్రజల సంతృప్తిని ప్రామాణికంగా తీసుకుంటూ పనిచేస్తోందని....ఈ విషయాన్ని అధికారులు గ్రహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుదరదన్నారు.

**గిరిజన విద్యార్థులంటే అంత నిర్లక్ష్యమేంటి? :** నూజివీడులోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం, బోధనకు సంబంధించిన అంశాలపై హాస్టల్ వార్డెన్ ను మంత్రి ఆరా తీశారు. కొన్ని ముఖ్యమైన విషయాలపై సంబంధిత వార్డెన్ మంత్రి ప్రశ్నించడంతో సదరు వార్డెన్ సమాధానాలు చెప్పలేక నీళ్లు నమలాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాస్టల్ లో గిరిజన విద్యార్థుల సంఖ్య తగ్గడం ఏంటి? మీరు నిజంగా చిత్తశుద్ధితో పనిచేస్తే విద్యార్థుల సంఖ్య ఎందుకు పెరగదు? మీరు ఉద్యోగాలు చేస్తున్నారా, ఆడుకుంటున్నారా? మీరు సరిగ్గా పనిచేస్తే హాస్టల్ వైపు గిరిజన విద్యార్థులు తప్పకుండా వస్తారు....అంటూ వార్డెన్ నిర్లక్ష్యం పై మంత్రి నిప్పులు చెరిగారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి ఫోన్ చేసి వార్డెన్ నిర్వాకాన్ని వివరించారు. తక్షణమే నూజివీడు నియోజకవర్గంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్ల పరిస్థితులపై దృష్టి పెట్టాలని జిల్లా అధికారిని ఆదేశించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టే పరిస్థితి ఉండదని వార్నింగ్ ఇచ్చారు.

**బీసీ హాస్టళ్లపై అసంతృప్తి ఎందుకు పెరుగుతుంది?** నూజివీడు నియోజకవర్గంలోని బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల నిర్వహణ, భోజనం, వసతులు, బోధనకు సంబంధించిన అంశాల్లో ప్రజల్లో సంతృప్తి శాతం ఎందుకు తగ్గుతుందో సమాధానం చెప్పాలని మంత్రి సంబంధిత హాస్టళ్లకు సంబంధించిన వార్డెన్లను నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు ఎవరినైనా సరే తక్షనమే సస్పెండ్ చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని మంత్రి ఆదేశించారు. బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో అసలు ఏం జరుగుతుందో కనుక్కుని, అక్కడి పరిస్థితులను పరిశీలించి, చక్క దిద్దాల్సిన అంశాలను తన దృష్టికి తీసుకురావాలని జిల్లా అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. బీసీ విద్యార్థులను భవిష్యత్తులో ముందుకు తీసుకెళ్లేలా వార్డెన్లు, అధికారులు వ్యవహరించాలే తప్ప.....ఇలా అసంతృప్తికి గురిచేస్తే సహించే పరిస్థితులు ఉండవని మంత్రి తీవ్రంగా హెచ్చరించారు. ఏవైనా అవసరాలుంటే స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ వెళ్లాలని, వారి సహాయసహకారాలు కూడా తీసుకుని విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి విషయంలో ప్రజల్లో సంతృప్తి స్థాయి ఎట్టిపరిస్థితుల్లో పెరగాల్సిందేనని ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు వైద్యులకు మంత్రి పార్థసారథి హుకుం జారీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ, పారిశుధ్యం, మౌలిక వసతులు, మందుల పంపిణీ, రోగుల పట్ల వైద్యుల ప్రవర్తన తీరు, వైద్యం చేసే విధానాల్లో మార్పు రాకపోతే....సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. పేద ప్రజలు వైద్యం కోసం వస్తే...వారికి అవసరమైన రీతిలో వైద్యం అందించడం, అవసరమైన మందులు ఇవ్వడం, మౌలిక సదుపాయాలు కల్పించడం, ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారో చెప్పాలని సూపరింటెండెంట్ ను మంత్రి నిలదీశారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి ఏమైనా అవసరమైతే చెప్పాలని, సంబంధిత సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి పేర్కొన్నారు.

# విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి-- డాక్టర్ బి.వి.రమణ





**కందుకూరు, కలంకౌంటర్ :** విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని అమ్మ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, ఆత్మానంద స్వామీజీ డాక్టర్ బి.వి రమణ అన్నారు. కందుకూర్ టి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల నందు విశ్వ సాహితీ కళావేదిక, టి ఆర్ ఆర్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన నవ యువ కవి సమ్మేళనం కార్యక్రమంలో ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.వి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని. తల్లిదండ్రులని గురువులని గౌరవించుకోవాలని, తాను చదివిన పాఠశాలకు గ్రామానికి ఎదిగిన తర్వాత సహాయ సహకారాలు అందించాలని విద్యార్థులను కోరారు. సమాజం మనకేమిచ్చింది అని కాకుండా సమాజానికి మనమేం చేశామని దృక్పథంతో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని సూచించారు. తెలుగు భాషకు సంబంధించి అమూల్యమైన రెండు కవితలను విద్యార్థులకు చదివి వినిపించారు. అనంతరం గజల్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ బివి రమణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వ సాహితీ కళా వేదిక అధ్యక్షురాలు కొల్ల రామావతి, డాక్టర్ రంగిశెట్టి రమేష్, కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోనా కు ఆహ్వానం



**అత్తిలి,కలంకౌంటర్ :** ఐ వి ఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండల కార్యవర్గం ప్రమాణస్వీకారం ఈ నెల 26 న ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆహ్వాన పత్రికను ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు కు అందజేసి ముఖ్య అతిథిగా ఆహ్వానించిన మండల అధ్యక్షుడు .హరికృష్ణ, జిల్లా కార్యదర్శి ప్రసాద్ .


కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..

సెల్ : 9346935672


# నాగ మల్లికకు ఘన సన్మానం



**నరసరావుపేట,కలంకౌంటర్ :** పట్టణానికి చెందిన కస్తూరి కోలాటం గురువు నాగ మల్లికను బుధవారం కోలాటం నేర్చుకుంటున్న మహిళలుబుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగ మల్లికను శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల కార్యవర్గ సభ్యులు బత్తుల మురళితో పాటు కోలాటం నేర్చుకుంటున్న పలువురు ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మర్యాద పూర్వక కలయిక



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఛాంబర్ లో రాష్ట్ర మంత్రి ఎస్.సవితను మర్యాదపూర్వకంగా కలిసిన బొబ్బిలి శాసనసభ్యులు ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబీ నాయన). తన నియోజక వర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి మంత్రి సవితకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబీ నాయన). వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మంత్రి సవిత.

# మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం

**అమరావతి,కలంకౌంటర్ :** మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# నావికా దళ విన్యాసాలు తిలకించిన రాష్ట్రపతి,గవర్నర్,సిఎం



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో నావికా దళ విన్యాసాలు తిలకిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము , గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ . ఈ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల హాజరయ్యారు.



















## ఆహ్వానం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం వాసవి భవన్ లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ మహోత్సవం కార్యక్రమానికి శ్రీ రామ లింగేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వర రావు,శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ మామిడి మురళీ కృష్ణ,నగర ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేసిన కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్.







Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com